కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం



మీనాక్షి నట్రాజన్‌తో సమావేశమైన మమతా గుప్తా, సంతోష్‌గుప్తా, పరమేశ్వరీ సింగ్

అబిడ్స్: తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నట్రాజన్‌తో గోషామహల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు మమతా గుప్తా, పరమేశ్వరీ సింగ్, సీనియర్ నేత సంతోష్‌గుప్తా సమావేశమయ్యారు. ఈ సందర్భ ంగా గోషామహల్ నియోజకవర్గంలో పార్టీని పటిష్టం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటా అందించాలని ఆమె సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని వివరించారు.

నేడు వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు

సుల్తాన్‌బజార్: పశ్చిమ బెంగాల్‌లో హిందూవులపై జరుగుతుగున్న హింసను నిరసిస్తూ 19న విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు బోజనపల్లి నర్సింహామూర్తి, జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్, రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పశ్చిమబెంగాల్‌లో హిందూవులపై జరుగుతున్న మారణకాండను విశ్వహిందూ పరిషత్ తీవ్రంగా నిరసిస్తుందన్నారు. బెంగాల్ రాష్ట్రంలో హిందూవులకు రక్షణ కల్పించి రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ బిల్లు పేరుతో హిందూవులను అత్యంత దారుణంగా హింసకు గురిచేయడాన్ని నిరసిస్తూ రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు నిర్వహించి జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున హిందూవులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఉన్నత చదువులతో బంగారు భవిష్యత్తు

గోల్కొండ: ఉన్నత చదువులతో బంగారు భవిష్యత్తు ఉంటుందని పీస్ ఫోర్స్ కమిటీ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. శుక్రవారం ఆయన టోలిచౌకీలోని తన కార్యాలయంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు రాసిన విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..ముస్లిం విద్యార్థులకు రాష్ట్రంలో పదో తరగతి పూర్తి చేసిన వారికి ప్రభుత్వ మైనార్టీ కళాశాలలు, బీసీలు, దళితుల కోసం సంక్షేమ ఇంటర్ కళాశాలలు ఉన్నాయన్నారు. అర్హులైన నిరుపేదల కోసం తమ పీస్ ఫోర్స్ సొసైటీ ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసిందని దీన్ని ద్వారా నిరుపేదలకు స్కాలర్‌షిప్‌లు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ కార్యదర్శి మహ్మద్ ఫహాద్ తదితరులున్నారు.

జుమ్మెరాత్‌బజార్‌లో వన్యప్రాణుల నకిలీ అవయవాల విక్రయం

అబిడ్స్: జుమ్మెరాత్‌బజార్ సంతలో నెమలి తలతో పాటు వన్యప్రాణుల అవయవాలు విక్రయానికి ఉంచడం కలకలం రేపింది. షాహినాయత్‌గంజ్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మహారాష్ట్ర జాల్నా ప్రాంతానికి చెందిన ముగ్గురు మహిళలు జుమ్మెరాత్‌బజార్‌లో గురువారం జరిగిన పాత సామాన్ల సంతలో నెమలి తలతో పాటు బ్లాక్ ఐబీస్ అనే పక్షికి సంబంధించి నాలుగు పుర్రెలు, ఎనిమిది కాళ్లు, నకిలీ పులి చర్మం, నకిలీ పులి గోర్లను విక్రయించేందుకు యత్నిస్తుండగా పోలీసులు దాడి చేసి వాటిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న అవయవాలతో పాటు నిందితులను జిల్లా అటవీశాఖ అధికారులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై హైదరాబాద్ జిల్లా అటవీశాఖ అధికారి విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా పోలీసులు అప్పగించిన అవయవాలు నకిలీవని తెలిపారు. మాంసం ముద్దలకు నెమలి ఈకలు పెట్టి విక్రయించేందుకు యత్నించినట్లు తెలిపారు. నకిలీ అవయవాలు అని తేలడంతో ముగ్గురు మహిళలను వదిలివేసినట్లు ఆయన వివరించారు.

అద్దంకి దయాకర్, అంజన్ కుమార్ యాదవ్‌పై ఫిర్యాదు

చాంద్రాయణగుట్ట: ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి అల్లి శివచంద్రగిరి కోరారు. ఈ మేరకు బీజేవైఎం నాయకుల బృందం శుక్రవారం ఛత్రినాక పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.ఎన్.ప్రసాద్ వర్మకు ఫిర్యాదు చేశారు. ఈ సదర్భంగా శివ చంద్రగిరి మాట్లాడుతూ..భారత ప్రధానిపైనే ఇష్టానుసారంగా మాట్లాడడం కాంగ్రెస్ నేతలకు తగదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం ఉపాధ్యక్షుడు అర్జున్, కార్యదర్శి అనిరుధ్, కార్యాలయ కార్యదర్శి సచిన్‌తో పాటు సాయి కుమార్, సాకేత్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన

- జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- విరిగిపడిన చెట్లు, విద్యుత్ స్తంభాలు, తీగలు
- స్తంభించిన ట్రాఫిక్

చార్మినార్: పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. డబీర్‌పురా దర్వాజా నుంచి డబీర్‌పురా ఫ్లైఓవర్ వరకు రోడ్డు పూర్తిగా ఐదు అడుగుల లోతు వరకు వరద నీటితో నిండిపోయింది. వాహనదారులు పడరాని పాట్లు పడ్డారు. నూర్ఖాన్ బజార్, పురానీహవేలీ, డబీర్‌పురా దర్వాజా నుంచి చంచల్‌గూడా, కుర్మగుడా, సైదాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లడానికి ఈ రోడ్డు ప్రధాన రహదారి కావడంతో ప్రతిరోజు ఇక్కడ వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. అయితే ఎప్పుడు వర్షం కురిసినా..ఈ రోడ్డు జలమయం అవుతోంది. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలిగింది. దాదాపు రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



రెడ్‌హిల్స్‌లో హైటెన్షన్ వైర్లపై కూలిన చెట్టు



ఇసామియాబజార్‌లో ఆటోపై కూలిన చెట్టు

నాంపల్లిలో..

నాంపల్లి: నాంపల్లి, రెడ్‌హిల్స్, మల్లేపల్లి, సీతారామ్‌భాగ్, చింతలబస్తీ, మాసబ్‌ట్యాంక్, ఫస్ట్‌లాన్సర్, ఏసీగార్డ్స్, సీబీబీ క్వార్టర్స్, లక్డీకాపూల్, హబీబ్‌నగర్, అఫ్జల్‌సాగర్, బోయిగూడ కమాన్ పరిసర ప్రాంతాల్లో చెట్లు నేల కూలాయి. రెడ్‌హిల్స్ నాంపల్లి క్రిమినల్ కోర్టు సమీపంలో ఉద్యానవన శాఖ కమిషనరేట్ ప్రాంగణంలోని ఓ చెట్టు హైటెన్షన్ వైరు మీద పడింది. ఈ సమయంలో పెద్ద అగ్ని ప్రమాదం సంభవించింది. ప్రమాద సమయంలో ఎవరూ అక్కడ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది.

లంగర్‌హౌస్‌లో..

లంగర్‌హౌస్: గాలి వాన భీభత్సం సృష్టించింది. శుక్రవారం సాయంత్రం ఈదురుగాలలతో కూడిన వర్షాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లంగర్‌హౌస్ బాపునగర్‌లో ఇళ్లపై పెద్ద వృక్షం, హై ఓల్టేజ్ విద్యుత్ స్తంబాలు కూలి ఇళ్లపై, రోడ్లపై పడ్డాయి. దీంతో పలు వాహనాలు కూడా ధ్వంసమయ్యాయి. మోకాళ్ల లోతు నీళ్లు ప్రధాన రహదారులపై ప్రవహించడంతో వాహనదారులు, పాదచారులు హైరానా పడ్డారు.

కోఠి ఇసామియాబజార్‌లో..

సుల్తాన్‌బజార్: కురిసిన భారీ వర్షానికి సుల్తాన్‌బజార్‌లోని పరిసర ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈదురు గాలులతో కూడిన వర్షానికి కోఠి ఇసామియాబజార్ మెహర్‌బాబా లేన్‌లో ఓ భారీ చెట్టు కూలి అక్కడే పార్క్ చేసిన ఆటోపై పడడంతో ఆటో పూర్తిగా ధ్వంసమైంది. ఈ సమాచారం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు చెట్టుకొమ్మలను తొలగించారు. ప్రజలు కార్యాలయాల నుంచి ఇంటికి వెళ్లే సమయంలో భారీ వర్షం కురవడంతో కోఠి ఉమెన్స్ కళాశాల నుంచి చాదర్‌ఘాట్ వరకు తీవ్ర ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది.

ఈదురుగాలులకు కూలిన భారీ క్రేన్


అబిడ్స్: శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షానికి అబిడ్స్‌లో ప్రమాదం సంభవించింది. అబిడ్స్ రామకృష్ణ థియేటర్ ఎదురుగా నిర్మాణంలో ఉన్న భవనం వద్ద భారీ క్రేన్ కూలింది. ఈ ప్రమాదంలో పలు వాహనాలు ధ్వంసం అయ్యాయి. క్రేన్ కూలిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అబిడ్స్ పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి వచ్చి వాహనాలను తొలగించారు.



లంగర్‌హౌస్‌లో ఇళ్లపై కూలిన హైఓల్టేజ్ విద్యుత్ స్తంభం



డబీర్‌పురా రోడ్డులో..



కూలిన భారీ క్రేన్



కబూతర్ ఖానా లక్ష్మీ నరసింహస్వామి ఆయంలో కూలిన భారీ చెట్టు



లంగర్‌హౌస్‌లో..

వేణుకు అంబేడ్కర్ ఎక్సలెన్సీ అవార్డు



వేణుకు అవార్డు అందిస్తున్న దృశ్యం

గన్‌ఫౌండ్రీ: విద్యుత్ శాఖలో ఉత్తమ విధులు నిర్వహిస్తున్న అంత దుప్పుల వేణుకి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఎక్సలెన్సీ–2025 అవార్డును అందజేశారు. రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో వేణుకు రాష్ట ప్లానింగ్ కమిషన్ చైర్మన్ జి.చిన్నారెడ్డి, మాజీ మంత్రి వేణుగోపాల చార్యులు అవార్డు అందజేసి ఘనంగా సత్కారం చేశారు. అతను విద్యుత్ సంస్థలో ఉద్యోగిగా ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణముగా వినియోగదారులకు అత్యున్నతమైన సేవలను అందిస్తూ ప్రజల ఆధారాభిమానాలను చూరకొనడంతో పాటు దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ 1104 కార్మిక సంఘానికి అధ్యక్షుడిగా ఉంటూ 20 ఏళ్లుగా విద్యుత్ కార్మికుల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్నందుకు ఈ ప్రతిష్టాత్మక అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఉపన్యాసకులు దేవాజ్ఞ శర్మ, నవకళ వేదిక అధ్యక్షుడు మల్లికార్జున రావు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లతో విద్యార్థులు

ఉత్సాహంగా కల్చరల్ ఫెస్ట్

చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమాలోని నారాయణ సీబీఎస్ఈ పాఠశాలలో గురువారం రాత్రి వార్షిక కల్చరల్ ఫెస్ట్ ఘనంగా కొనసాగింది. ఈ సందర్భంగా విద్యార్థులు పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీబీడీ ఆడిట్ ఆఫీసర్ మహ్మద్ జహంగీర్ షరీఫ్, మల్కాజ్‌గిరి జిల్లా ఎక్సైజ్ అధికారి కె.నవీన్‌పై తరగతులకు వెళుతున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సరిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జీఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం వై.రవీంద్ర బాబు, ప్రిన్సిపాల్ నౌషిన్ ఫాతీమా, ఏవో రాజు, ఏడీ సాయిబాబు, కోఆర్డినేటర్లు జ్యోతిరావు, స్వప్న, వందన పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిస్తాం



అవార్డు గ్రహీతలతో చిన్నారెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిస్తామని తెలంగాణ రాష్ట ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో మెగాసిటీ నవ కళావేదిక, మదర్ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎక్సలెన్సీ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి ఎస్.వేణుగోపాల చారి, సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞా శర్మ, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ టి.ఆనందమూర్తి, హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ నేత, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మల్లికార్జున్‌రావు, కార్యదర్శి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

లంగర్‌హౌస్: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ ఓ పత్రిక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఓయూ కాలనీ, జ్యోతినగర్ ఫీడర్ల పరిధిలోని మోతి మహల్, సాదద్‌నగర్, హీరా ఖానా, సక్కుభాయి కాలనీ, షేక్‌పేట్, సప్తగిరి కాలనీ, ఖాదర్‌బాగ్, రాక్‌హిల్స్ కాలనీ, బహదూర్ జంగ్ కాలనీ, సర్దార్‌బాగ్, జ్యోతినగర్ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే 11 కేవీ బీఎస్ఎన్ఎల్ ఫీడర్ పరిధిలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, మిరాజ్ కాలనీ, ఐఎఎస్ కాలనీ, చోటాజానకీ నగర్, బకత్వర్‌గుడ, జానకీ నగర్, పారామౌంట్ కాలనీ, ఎంసీహెచ్ కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

షేక్‌పేట్ మజీద్ ఏ నూర్ అధ్యక్షుడిగా మహ్మద్ ముస్తాఫా



మహ్మద్‌ముస్తాఫాను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: షేక్‌పేట్ మజీద్ ఏ నూర్ అధ్యక్షుడిగా సీనియర్ మజ్లిస్ నాయకుడు మహ్మద్ ముస్తాఫా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం సెవన్ టూంబ్స్‌ను ఆనుకొని ఉన్న మజీద్ ఏ నూర్‌లో నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా మహ్మద్ ముస్తాఫా, ఉపాధ్యక్షులుగా మహ్మద్ ఫహీమ్‌ఉద్దీన్, సయ్యద్ మహబూబ్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ యూసుఫ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మహ్మద్ ముస్తాఫా మాట్లాడుతూ..మసీదు నిర్వహణ కత్తిమీద సాములాంటిదని ఆయన అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును తేవడం ముస్లిం మనోభావాలను దెబ్బతీయడమేనని ఆయన అన్నారు. దీనిని మనమంతా శాంతియుత పద్ధతిలో ఖండించి నిరసన తెలపాలని ఆయన పేర్కొన్నారు.

గుడిమల్కాపూర్‌లో బీజేపీ బస్తీబాట



వ్యాపారులకు ప్రధాని మోదీ విజయాలను వివరిస్తున్న అమర్‌సింగ్ తదితరులు

గోల్కొండ: ప్రధాని మోదీ పాలనలో మనదేశం అగ్రరాజ్యంగా ఎదిగిందని బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ అన్నారు. శుక్రవారంబస్తీబాటకార్యక్రమంలో భాగంగా గుడిమల్కాపూర్, కార్వాన్ డివిజన్లలో బీజేపీ నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రధాని మోదీ విజయాలను వివరించారు. ఈ సందర్భంగా గుడిమల్కాపూర్‌లోని కూరగాయల మార్కెట్‌లో చిరువ్యాపారులను కలిసి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వివిధ రకాల వ్యాపారుల కోసం విజయవంతంగా అమలుపరుస్తున్న పథకాలను వివరించారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం దోపిడీదారుల ప్రభుత్వం అని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియంతలా వ్యవహరిస్తూ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారన్నారు. ప్రధాని మోదీ సమర్థపాలనను గుర్తించిన వారంతా బీజేపీకి మద్దతు తెలుపుతున్నారన్నారు. గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఉద్దడి జగదీష్‌కుమార్, సీనియర్ నాయకులు సునీల్‌యాదవ్, కట్ల అశోక్, నాగరాజు తదితరులున్నారు.

'మతస్వేచ్ఛను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోంది'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: భారత రాజ్యాంగం ప్రసాదించిన మత స్వేచ్ఛను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ ధ్వజమెత్తారు. శుక్రవారం నానల్‌నగర్ డివిజన్ హకీంపేట్ జామా మసీదులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తే మజ్లిస్ ఆధ్వర్యంలో జరుగుతున్న భారీ బహిరంగ సభపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రపంచంలోనే అత్యుత్తమమైన భారత రాజ్యాంగాన్ని మోదీ ప్రభుత్వం అడుగడుగునా తూట్లు పొడుస్తుందన్నారు. వందల ఏళ్ల క్రితం నిర్మించిన చారిత్రక మసీదులకు ఎటువంటి యాజమాన్యా హక్కు పత్రాలు, అనుమతులు లేవని వాటన్నిటిని వక్ఫ్ బోర్డు నుంచి స్వాధీనం చేసుకోవడం అవివేకమైన చర్య అని ఆయన అన్నారు. వక్ఫ్ బోర్డు సవరణలో రెండో అభిప్రాయం లేకుండా వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. నేడు దారు సలాంలో జరిగే వక్ఫ్ బోర్డు సరవణ నిరసన సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నానల్ నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్, ఆలీముద్దీన్‌తో పాటు గోల్కొండ, టోలిచౌకీ, లంగర్‌హౌస్, కార్వాన్ తదితర ప్రాంతాల్లోని మసీదు నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మజ్లిస్ ప్రదర్శనలు, బహిరంగ సభకు భారీ బందోబస్తు



డీసీపీ చంద్రమోహన్

అబిడ్స్: ఈ నెల 19న నిర్వహించే మజ్లిస్ పార్టీ ర్యాలీలు, బహిరంగ సభకు 10 ప్లాటూన్‌లతో బందోబస్తు చేపడుతున్నట్లు సౌత్‌వెస్ట్‌జోన్ డీసీపీ జి.చంద్రమోహన్ వెల్లడించారు. జోన్ పరిధిలోని దారుసలాం, హబీబ్‌నగర్, మంగళహాట్, షాహినాయత్‌గంజ్, ఇతర పలు పోలీస్టేషన్ల ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. శనివారం రాత్రి దారుసలాంలో జరిగే బహిరంగ సభకు పోలీసుల బందోబస్తు, నిర్వాహకుల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ..మజ్లిస్ పార్టీ ర్యాలీలు ప్రశాంతంగా జరిగే విధంగా దాదాపు 200 మంది పోలీసులతో బందోబస్తును పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. అన్ని ప్రాంతాల్లో అదనపు పోలీసులు, 10 ప్లాటూన్‌ల పోలీసు సిబ్బందితో బందోబస్తును నిర్వహించనున్నట్లు తెలిపారు. గోషామహల్, ఆసిఫ్‌నగర్, కుల్సుంపురా, గోల్కొండ డివిజన్ల ఏసీపీలతో పాటు 10 పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు తమ తమ ప్రాంతాల్లో ర్యాలీలు ప్రశాంత వాతావరణంలో కొనసాగే విధంగా చర్యలు తీసుకుంట్టారని డీసీపీ చంద్రమోహన్ వివరించారు. అన్ని ప్రాంతాలు, కీలక చౌరస్తాల్లో సీసీ కెమెరాల ద్వారా నిఘాను పర్యవేక్షిస్తామని ఆయన వెల్లడించారు.

కళలతో మానసిక వికాసం



ఆర్ట్ గ్యాలరీలో చిత్రాలను తిలకిస్తున్న వీసీ ప్రొఫెసర్ గంగాధర్ తదితరులు

విజయనగర్‌కాలనీ: దైనందిన జీవితంలోని ఒత్తిళ్లను తగ్గించి మానసిక వికాసాన్ని పెంపొందించే శక్తి కళలకు ఉందని జేఎన్ఏఎఫ్ఏయు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ టి.గంగాధర్ అన్నారు. వరల్డ్ హెరిటేజ్ డేను పురస్కరించుకొని మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోని నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో శుక్రవారం హైదరాబద్‌కు లైన్ మారూ పేరిట పెయింటింగ్ ఎగ్జిబిషన్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..కళలకు, సంస్కృతి సాంప్రదాయాలకు హైదరాబాద్‌కు ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలోనే ప్రాచీన కట్టడాలు, కోటలు, గుళ్లు గోపురాలు తదితర చిత్రాలు ఈ ఎగ్జిబిషన్‌లో ఆకట్టుకుంటున్నాయి. ఈ నెల 20 వరకు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తిలకించవచ్చు. కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ, నిజాం అసఫ్‌జాహీ వంశానికి చెందిన నవాబు రౌనక్ యార్‌ఖాన్, ఫైనార్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంఎల్ ఆనంద్‌రావు, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షులు ఎంవి.రమణారెడ్డి, ప్రముఖ కార్టూనిస్ట్ శంకర్ పామర్తిలతో పాటు యూనివర్శిటీ అధ్యాపకబృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



కళాకారులతో నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: ప్రతి ఒక్కరూతమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ప్రముఖ సినీ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో జై జవాన్..జై కిసాన్..జై కళాకార్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కళావైభవం పేరిట సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చిన్నారులను విద్యతో పాటు శాస్త్రీయ కళల్లోనూ ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం పలువురు నాట్య గురువులను సత్కరించారు. అంతకు ముందు చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సినీనటి కరాటే కల్యాణి, ప్రొడ్యూసర్ కౌన్సిల్ మెడికల్ సలహాదారులు డాక్టర్ డి.చక్రవర్తి, ఆయూష్ శాఖ యోగా బోధకురాలు మమతా, సంస్థ వ్యవస్థాపకులు లయన్ కేవీ రమణారావు పాల్గొన్నారు.

నవ్యనాటక సమితి కళారంగ సేవ అపూర్వం



చైత్ర చంద్రిక వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న ఉప సంచాలకులు వసుంధర తదితరులు

సుల్తాన్‌బజార్: ఆరున్నర దశాబ్దాలుగా భారతీయ శాస్త్రీయ సంగీత నృత్య రీతుల్లో యువ కళాకారుల ప్రతిభకు పట్టం కడుతూ..వారిని ప్రోత్సహిస్తున్న నవ్యనాటక సమితి సాంస్కృతిక రంగ సేవ అపూర్వమని రాష్ట్ర ఖజాన, లెక్కల శాఖ ఉప సంచాలకులు జి.వసుంధర అన్నారు. శుక్రవారం సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణ దేవారాయ తెలుగు భాషా నిలయంలో నవ్యనాటక సమితి నిర్వహిస్తున్న 'చైత్ర చంద్రిక అభినయ వర్క్‌షాప్‌ను ఆమె ప్రఖ్యాత నర్తకి స్వప్నసుందరితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఈ అభినయ కార్యశాలను స్వయంగా విదూషి స్వప్నసుందరి నిర్వహించడం అరుదైన సాహిత్య అంశాన్ని ఎంపిక చేసుకొని అభినయంలో మెలకువలు నేర్పడం యువ కళాకారులకు లభించిన అపూర్వ అవకాశమన్నారు. విదూషి స్వప్న సుందరి మాట్లాడుతూ...నృత్య సాహిత్య అంశాలకు తగిన విధంగా అందరికి అర్థమయ్యేలా అభినయించడం ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సుధామాల నృత్య కళాకారులు డాక్టర్ ఇందిరా హేమ, మధుమతి కులకర్ణి, మాధవిమాల, లక్ష్మీప్రసన్న ఈ కార్యక్రమానికి సమన్వయం చేశారు. నవ్యనాటక సమితి అధ్యక్షులు హేమరాజు విజయ్‌కుమార్, బాలాజీ శర్మ, కన్నారావు పాల్గొన్నారు.